ప్రజావాణి.. 6 ఫిర్యాదులు



సమస్యలు తెలుసుకుంటున్న డీసీ శశిరేఖ

చందానగర్ : చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ శశిరేఖ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై 6 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్ ప్లానింగ్ 2, ఇంజనీరింగ్ 2, రెవెన్యూ 1, ఎలక్ట్రికల్ 1 సెక్షన్లకు సంబంధించినవి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీడీఐలో రక్తదాన శిబిరం



రాయదుర్గం: రక్తదానం చేయడానికి విద్యార్థులు, యువత ముందుకురావాలని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఎఫ్‌డీడీఐ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. హిమాయత్‌నగర్‌లోని పివి నర్సింహారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడి, అమిత్‌పురి, హుస్సేన్, జ్యోతిప్రియ, ఇళయరాజ, విద్యార్థులు రోషిత, లోకేష్‌శ్రీరామ్, సంతోష్, జీవా, పివి చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముబాషిరాపటేల్‌కు శ్రీనివాస రాయప్రోల్ అవార్డు

రాయదుర్గం: శ్రీనివాస రాయప్రోల్ కవితా బహుమతి–2025కి ముబాషిరాపటేల్‌ను ఎంపిక చేశా రు. అమె ముంబాయి విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ విభాగం విద్యార్థిని. ఈ అవార్డుకు దేశవ్యాప్తంగా యువ కవితలు రాసేవారి లో 126 మంది పోటీదారుల నుంచి ఆమెను జ్యూరీ ఎంపిక చేయడం విశేషం. ఈ అవార్డు కింద ప్రశంసాపత్రం, రూ.15వేల నగదు బహుమతిని ఇస్తారు. ఈ అవార్డును అక్టోబర్ 25న శ్రీనివాస్ రాయప్రోల్ 100వ జయంతి సందర్భంగా విజేతకు ప్రదానం చేస్తారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, ఒకరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

‘సేవ్ అవర్ లేక్’

- చిన్నాపెద్దచెరువుకు మహర్దశ
- శుద్ధి నుంచి స్వచ్ఛత దిశగా..
- మట్టిలేని హైడ్రో ఫోనిక్స్ మొక్కలు ఏర్పాటు

రాయదుర్గం: చిన్నాపెద్దచెరువుకు మహర్దశ కలగనుంది. సహజ పద్ధతిలో నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన నీరుగా మార్చాలని నిర్ణయించారు. గోపన్‌పల్లి–గోపన్‌పల్లితండా మధ్యన ఉండే ఈ చెరువును ‘సేవ్ అవర్ లేక్’ పేరిట రక్షించనున్నారు. చెరువులో మురుగు నీరు చేరడం, మురుగునీటి పైప్‌లైన్ చెరువు మధ్యలో నుంచే వెళ్లడం వంటి కారణాలతో చేపలు మృత్యువాత పడడం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రోఫోనిక్స్ పద్ధతిన చెరువును శుద్ధి చేయాలని చర్యలు ప్రారంభించారు. సీఎస్ఆర్ కింద వేదాంత ఫౌండేషన్, ఐబీఎం సంస్థ, గ్రీన్ ఆర్మీ వాలంటీర్లు, ఎస్ అండ్ పి గ్లోబల్ ఉద్యోగులతో బాటు చుట్టూ నివాసముండే బ్రిక్స్‌స్కైవుడ్స్, ముప్పా, హానర్ ఆక్వాంటీస్, ముప్పా అపార్ట్‌మెంట్‌వాసులు, స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.


ఫ్లోటింగ్ వెట్‌ల్యాండ్ మోడల్ ఇదే



20 ‘ఫ్లోటింగ్ వెట్‌ల్యాండ్’లు..

- మట్టిలేకుండా నీటిలో పెరిగే మొక్కల (హైడ్రోఫోనిక్స్) పద్ధతిని అవలంబిస్తున్నారు. ఈ మొక్కల వేర్లు చెరువులోని మలినాలను తీసుకుంటాయి. దీంతో నీరు స్వచ్ఛంగా మారుతుంది.
- ప్రస్తుతం ఒక్కో ఫ్లోటింగ్ వెట్‌ల్యాండ్‌లో 16 మొక్కల చొప్పున మొత్తం 320 మొక్కలు ఏర్పాటు చేశారు
- మొదటివిడతలో 10 ‘ఫ్లోటింగ్ వెట్‌ల్యాండ్’లను, రెండవవిడతలో మరో 10 ఏర్పాటు చేశారు.
- చెరువులలో నీటిశుద్ధికి ఎస్‌టీపీ ఏర్పాటుకు కోట్లాది రూపాయలతో బాటు విద్యుత్ చార్జీల భారం భారీగా పడుతోంది.
- ‘ఫ్లోటింగ్ వెట్‌ల్యాండ్’తో తక్కువ ఖర్చుతో సహజపద్ధతిలో నీటి శుద్ధి జరుగుతుంది.


గోపన్‌పల్లి–గోపన్‌పల్లితండా మధ్యన ఉండే చిన్నాపెద్దచెరువు



పర్యావరణ రక్షణ మన కర్తవ్యం



పర్యావరణ రక్షించడం మనందరి కర్తవ్యం. పరిసరాలను శుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు కృషి చేయాలి. చెరువు కలుషితం కాకుండా మా వంతు కృషి చేస్తాం. అందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలి

–పిఎస్.రెడ్డి, బ్రిక్స్ స్కైవుడ్స్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

చెరువును సుందరీకరించాలి



గోపన్‌పల్లిలోని చిన్నాపెద్దాచెరువును కాపాడుకోవాలి. సీఎస్ఆర్‌తో పాటు జీహెచ్ఎంసీ, నీటి పారుదలశాఖ ముందుకొస్తే అభివృద్ధి చెందుతుంది. పెద్దఎత్తున అపార్ట్‌మెంట్లు ఉండేచోట ఈ చెరువును సుందరీకరిస్తే ఆహ్లాదకరంగా మారడం ఖాయం.

–పి.బి.రెడ్డి, గోపన్‌పల్లి బ్రిక్స్‌వుడ్స్ అపార్ట్‌మెంట్స్ ప్రధాన కార్యదర్శి

ఆకట్టుకుంటున్న దసరా బొమ్మలకొలువు

శేరిలింగంపల్లి: దసరా బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. శేరిలింగంపల్లి అలింద్ ఎంప్లాయిస్ హౌసింగ్‌కాలనీలోని సాయికిరణ్ అపార్ట్‌మెంట్‌లో జలజకుమారి, మురళీధర్ కుటుంబం ప్రతియేటా ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నారు. ఈ బొమ్మల కొలువులో దశావతారాలు, కొండపల్లి బొమ్మలు, భాగవతం, రామాయణం, భగవద్గీత, చోటాభీమ్, చుట్కి, జగ్గు, కాలియా, రాజు, డోలు, పల్లెటూరు, సంత, బొమ్మలు, పెళ్ళి పల్లకి, బ్యాండు వారు గంగిరెద్దు, కాడెద్దులు, ఎద్దుల బండి, పక్షులు, జంతువులు, కూరగాయలు, పండ్లు, గుడిసెలు, పెంకుటిల్లు, తాటిచెట్లు, గీతకల్లు, కాకి నీళ్ళకుండ, ఏనుగు మావటివాడు, డాల్ హౌజ్, నీటి ఫౌంటెన్లు అమర్చారు.


జలజకుమారి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

నిరంతరం స్వచ్ఛభారత్‌ను కొనసాగించాలి

‘ఎస్కీ’ డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: స్వచ్ఛభారత్ ఉద్యమం నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని ‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో సోమవారం ‘స్వచ్ఛతా హీ సేవా–2025’ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లో అధికారులు, ఉద్యోగులు, ఫ్యాకల్టీ, విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక్కసారి కాకుండా ప్రతి మాసం ఒకరోజు మన పరిసరాలను మనమే స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలన్నారు. ఎస్కీ’ క్యాంపస్‌లో ఇక నుంచి ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్కీ సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతారావు, డాక్టర్ పి రాజారావు, ప్రొ.వెంకట్‌రెడ్డి, కె.జే.అమర్‌నాథ్ డాక్టర్ చంద్రకళ, డాక్టర్ యూఎస్ జ్యోతి, సయ్యద్ అజ్గర్, అనితా అగర్వాల్, డాక్టర్ విద్యాసాగర్, రామకిషోర్, పి.సాయికిషోర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


క్యాంపస్ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

శిల్పారామంలో దసరా ఉత్సవాలు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్ : కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బెంగళూరుకు చెందిన వైష్ణవి, నాట్యశాల గురువు మిథున్‌శ్యామ్, దీపక్ శిష్యబృందాలు భరతనాట్య ప్రదర్శనతో సోమవారం అలరించారు. ఇందులో గజవదానబెడువే, అఖిలాండేశ్వరిఇ, రంజనిమాల, అమ్మ ఆనందదాయిని, అయిగిరినందిని, అష్టలక్ష్మి తదితర అంశాలను అనన్య, లక్షిత, నమ్రత, ప్రిష్ణ, పర్ణిక, పూర్విక, శాన్వి, స్మతికి, శ్రీజ, తపస్య, సహన ప్రదర్శించి అలరించారు. నేటి నుంచి సౌత్‌సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగపూర్ స్పాన్సర్ ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, జమ్మూ, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల జానపద నృత్యాలు ఏర్పాటు చేయనున్నారు.




బీఆర్ఎస్ నేతల అరెస్ట్

మాదాపూర్: మెట్రో రెండవ దశ పనులు ప్రారంభించకపోవడం, ఎయిర్‌పోర్టు నుంచి రూట్‌ను కుదించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన శిలాఫలకం పాలాభిషేకం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం మాదాపూర్ మైండ్‌స్పేస్‌లోని మెట్రో రెండవ దశ శిలాఫలకానికి పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జీ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి, శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమిరిశెట్టిసాయిబాబా నాయకత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. కార్తీక్‌రెడ్డి, సాయిబాబా, నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లకు తీసుకెళ్ళి ఆ తర్వాత వదిలిపెట్టారు.

తాత్కాలిక స్టాప్‌గా లింగంపల్లి రైల్వే స్టేషన్

అక్టోబర్ 5 వరకు అవకాశం



శేరిలింగంపల్లి: దసరా పండగను పురస్కరించుకొని రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం దూర ప్రాంతాలకు వెళ్ళే రైళ్ళను తాత్కాలికంగా లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగే సౌకర్యాన్ని కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ సౌకర్యం అక్టోబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆగే రైళ్ళు్ల సమయాలు

- ట్రెన్ నెంబర్ 22718– సికింద్రాబాద్–రాజ్‌కోట్................ లింగంపల్లిలో––15.39–40
- ట్రెన్ నెంబర్ 22717 రాజ్‌కోట్–సికింద్రాబాద్................. లింగంపల్లిలో–06.09–10
- ట్రెన్ నెంబర్ 20967.. సికింద్రాబాద్– పోరుబందర్.............. లింగంపల్లిలో–15.39–40
- ట్రెన్ నెంబర్20968.... పోరుబందర్–సికింద్రాబాద్............ లింగంపల్లిలో–06.09–10
- ట్రెన్ నెంబర్12731.... తిరుపతి– సికింద్రాబాద్................ లింగంపల్లిలో–5.34–35
- ట్రెన్ నెంబర్12732... సికింద్రాబాద్–తిరుపతి.................. లింగంపల్లిలో–25.24–25
- ట్రెన్ నెంబర్12701.. సీఎస్‌టీ ముంబాయి–హైదరాబాద్.... –లింగంపల్లిలో– 10.59–11–00
- ట్రెన్‌నెంబర్12702.. హైదరాబాద్–సీఎస్‌టీ ముంబాయి....... లింగంపల్లిలో–15.19–20

నిజాయితీ చాటుకున్న కండక్టర్ సంగమేష్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు వదిలి వెళ్లిన బ్యాగును అందజేసి కండక్టర్ నిజాయితీని చాటుకున్నాడు. డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యూసుఫ్‌గూడకు చెందిన శ్రీశైలం లక్ష్మీ హుండాయ్ షోరూమ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ ఎస్ఆర్ నగర్ నుండి హిమాయత్‌నగర్ వైపు ఆర్టీసీ మియాపూర్ –2 డిపో పరిధిలోని బస్సులో ప్రయాణించాడు. ఈ క్రమంలో తన బ్యాగును బస్సులో మర్చిపోయాడు. అనంతరం కండక్టర్ సంగమేష్ డిపో అధికారులకు సమాచారం ఇచ్చి అందజేశారు. ఆ బ్యాగును చూడగా అందులో రూ.8వేలు విలువచేసే మనీ స్వైపింగ్ మిషన్‌ను గుర్తించారు. రసీదు ఆదారంగా ప్రయాణికులు శ్రీశైలంకు విషయం తెలిపారు. సోమవారం డిపో మేనేజర్ వెంకటేశం, డిపో ఉద్యోగుల సమక్షంలో ప్రయాణికుడు శ్రీశైలంకు బ్యాగు అందజేశారు. కండక్టర్ సంగమేష్‌ను శాలువాతో సత్కరించి అభిందించారు.


కండక్టర్ సంగమేష్‌ను సత్కరిస్తున్న డిపో అధికారులు

తవ్వారు .. వదిలేశారు



జేపీనగర్ ప్రధాన రోడ్డు అరబిందో కాలనీ వద్ద రోడ్డును తవ్విన దృశ్యం

కాల్వ పనులు పూర్తయ్యేదెన్నడు..?

మియాపూర్ : డివిజన్ పరిధిలోని జేపీఎన్‌నగర్ కాలనీ నుండి శ్రీరంగపురం కాలనీ వెళ్లే ప్రధాన రోడ్డును వరదనీటి కాల్వ పనుల నిమిత్తం తవ్వి వదిలేశారు. పది రోజుల కిందట రోడ్డు మధ్యలో ఓచోట, రోడ్డు ప్రక్కన మరోచోట తవ్వి పనులు చేపట్టకుండా వదిలేశారు. వివరాలిలా.. జేపీఎన్ నగర్ ప్రధాన రహదారిపై అరబిందో కాలనీ, అల్లూరి సీతారామరాజు విగ్రహం ముందు భారీగా వరదనీరు రోడ్డుపై నిల్వ ఉంటుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వరదనీరు నిల్వకుండా అధికారులు నాల నిర్మాణ పనులను చేపట్టారు. కాల్వ నిర్మాణం కోసం రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గుంతలు తవ్వారు. అసలే వర్షాకాలం, భారీ వర్షాలు పడుతుండడంతో వరదనీరు రోడ్డును తవ్విన ప్రాంతంలో నిలిచిపోవడంతో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కాల్వ పనులను పూర్తి చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సరస్వతీదేవిగా..


సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ

శేరిలింగంపల్లి జోన్ బృందం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీమాతగా దర్శనం ఇచ్చారు. ఆలయాల్లో, మండపాల వద్ద అమ్మవారికి అర్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.రాయదుర్గం మండపం వద్ద నిర్వాహకులు భరత్‌కుమార్ దంపతులు చిన్నారులు, తల్లులతో కలిసి సామూహిక సరస్వతీ పూజలను నిర్వహించి వారికి పలక,బలపం, పెన్నులు పంపిణీ చేశారు.


గాలిదొడ్డిలోని ఆలయంలో సీతమ్మవారికి సరస్వతీమాత అలంకారం


జవహర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాంధీ


చండీహోమం


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి


రాయదుర్గంలోని ఊరపోచమ్మ పూజలో పాల్గొన్న భక్తులు


పాపిరెడ్డికాలనీలో .. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

దసరాకు ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

మియాపూర్: దసరా పండగకు సొంతూర్లకు వెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌కుమార్, సీఐ శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో డీఐ రమేష్ నాయుడు, పోలీస్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆటోలో మైక్ ఏర్పాటు చేసి జాగ్రత్తలు సూచిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా రాత్రివేళలో కాలనీ, బస్తీలలో గస్తీ ఏర్పాటు చేసి ఎలాంటి దొంగతనాలు జరగకుండా అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



మియాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న డీఐ రమేష్ నాయుడు

పాటించాల్సినవి...

- ఊర్లకు వెళ్లేవారు తమ చిరునామా, ఫోన్ నంబర్ సంబంధిత వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలి.
- ఇంటి తాళంచెవులు, పూలకుండీలలో, డోర్ మాట్స్ కింద పెట్టకూడదు. విలువైనా వస్తువులు వెంట తీసుకువెళ్లాలి.
- ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్లపై పార్క్ చేయకుండా ఇంటి ఆవరణలో పెట్టి హ్యాండిల్, వీల్స్‌కు లాక్‌లు వేసుకోవాలి. కారు డిక్కీలలో విలువైన వస్తువులను పెట్టరాదు.
- ఇంటిముందు న్యూస్ పేపర్, పాలప్యాకెట్స్ వేయకుండా చర్యలు తీసుకోవాలి.
- ఇంటిడోర్‌కు సెంట్రల్ లాక్ ఏర్పాటు చేసుకోవాలి. సొంతిల్లు అయితే గ్రిల్స్ పెట్టించుకుంటే రెండింతల జాగ్రత్త ఉంటుంది.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.
- ఊర్లకు వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదు.
- కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానంగా తిరుగుతుంటే స్థానిక పోలీసులకు లేదా 100కు సమాచారం అందించాలి.
- బంగారం, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రం చేసుకోవాలి.




ఆటో ద్వారా ప్రచారం

పోలీస్‌స్టేషన్ నంబర్లు

సీఐ: పి. శివప్రసాద్ –	9490617129	ఎస్ఐ : మౌనిక –	9502275682
డీఐ : రమేష్‌నాయుడు –	8331013218	ఎస్ఐ: శిరీష రెడ్డి –	6302938266
క్రైమ్ ఎస్ఐ : నర్సింహారెడ్డి –	8712568331	ఎస్ఐ: కృష్ణగౌడ్–	8712567047
అడ్మిన్ ఎస్ఐ: చంద్రయ్య–	8712568233	ఎస్ఐ: రాజేశ్వర్‌రెడ్డి –	8712568213
ఎస్ఐ: మల్లేశం –	9908696264	ఎస్ఐ: వెంకటేశ్వర్లు –	8712568310
ఎస్ఐ: లింగం –	9640100405	పెట్రోలింగ్ మొబైల్ (జాతీయ రహదారి నుంచి హఫీజ్‌పేట వైపు)–	8333993414
		పెట్రోలింగ్ మొబైల్ (జాతీయ రహదారి నుంచి మియాపూర్ వైపు)–	8333993411

గస్తీ పెంచుతాం..



పండుగ సెలవుల సందర్భంగా దొంగతనాలు జరిగే ఆస్కారం ఉంది. ఊర్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చోరీల నుంచి తప్పించుకోవచ్చు. పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాము. కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్‌లలో అవగాహన కార్యక్రమాలతో పాటు ఆటోలతో ప్రచారం చేయిస్తున్నాము. గస్తీ పెంచుతాం. –శివప్రసాద్, సీఐ మియాపూర్